క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



పామర్రులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో నూతనంగా ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. పామర్రులో ఎమ్మెల్యే సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆపదలో అండగా నిలిచాం

పెదవేగి : ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అర్హతే ప్రామాణికంగా భావించి అండగా నిలిచామని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం పినకడిమి గ్రామానికి చెందిన మాండ్రాజు అనిల్ పావని కుమార్తె అనారోగ్యంతో హస్పిటల్‌లో చికిత్స పొందగా, వారికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 30 వేల చెక్కును కొండలరావుపాలెం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శనివారం బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో కొప్పాక సొసైటీ చైర్మన్ చళ్ళగొళ్ల భూస్వామి, పర్వతనేని నాగయ్య ఉన్నారు,

పిల్లల పోషణపై దృష్టి సారించాలి



పెదవేగి సెక్టార్ సమావేశంలో పాల్గొని రికార్డులను తనిఖీ చేస్తున్న సీడీపీఓ విజయలక్ష్మి

పెదవేగి : పిల్లల ఎత్తు, బరువు ఎప్పటికప్పుడు సరిచూస్తూ పోషణ సక్రమంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని పెదపాడు సీడీపీవో కె. విజయలక్ష్మి చెప్పారు. అంగన్‌వాడీ సెక్టారు సమావేశం పెదవేగి, విజయరాయిలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెదవేగి సెక్టారు సమావేశంలో సీడీపీవో మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేకచర్యలు తీసుకుంటుందన్నారు. ఆదివారం నిర్వహించనున్న పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహణలో మన వంతు భాగస్వామ్యాన్ని అందించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్ సీహెచ్. పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజుపేటలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పెదపాడు: గ్రామాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టినట్లు పెదపాడు విద్యుత్ శాఖ ఏఈ వై రాంబాబు తెలిపారు. పెదపాడు మండలంలోని రాజుపేటలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని ఏఈ రాంబాబు తెలిపారు. దీనివల్ల అన్ని గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని చెప్పారు.

ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

ఉంగుటూరు: ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులు ఉచితంగా చదువుకునేందుకు ప్రభుత్వం కల్పించిన 25 శాతం సీట్లు పొందేందుకు దరకాస్తు చేసుకోవాలని ఉంగుటూరు మండల విద్యాశాఖ అధికారి కె. శ్రీనివాసరావు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఫిబ్రవరి 23 తేదీ నుంచి మార్చి 14వ తేదీలోపు దరకాస్తు చేసుకోవాలని సూచించారు.విద్యార్థులు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, అర్హత పత్రాలు పొందుపరచాలని తెలిపారు. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు ఆన్‌లైన్ టోల్ ఫ్రీ నం. 14417కు ఫోను చేయవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శ్రీనివాసరావు కోరారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

ఏలూరు రూరల్: చిత్రలేఖనం పోటీల్లో శనివారపుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం గుంటూరు కెల్ యూనివర్సిటీ ఆవరణలో నెహ్రూ యువ కేంద్రం అనుబంధ సంస్థ డ్రీమ్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న కె.ప్రేమ్‌కుమార్, ఎల్ భాను ప్రకాష్, సీహెచ్ తారక్, కె.తేజశ్రీ బంగారు, కె.గాయత్రి, ఆర్ యమున, ఎం లికితరాణి, బి.ప్రణవి సిల్వర్ పతకాలు సాధించారని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక.. సచివాలయ వ్యవస్థ

- ప్రజలకు నేస్తంలా సేవలందిస్తున్న ఉద్యోగులు
- గ్రామాల్లో నూతన కార్యాలయాల నిర్మాణం
- ప్రజలకు చేరువగా ప్రభుత్వ సేవలు

ఇదీ కదా.. అభివృద్ధి

పెదవేగి : సమస్త సేవలకు నిలయంగా సమస్యల పరిష్కార వేదికగా ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ వారికి నేస్తంగా, ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా ప్రభుత్వ సేవలను చిత్తశుద్ధితో నిర్వహిస్తున్న సచివాలయ వ్యవస్థ అందరి ప్రశంసలను అందుకుంటోంది. గత పాలనలో ఆదాయ, కుల ధ్రువీకరణ తదితర పత్రాలకోసం అర్జీదారులు మండల కేంద్రాలకు చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేది. ప్రభుత్వ సేవలన్నీ నేడు సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేరువ చేశారు.

దెందులూరు నియోజకవర్గ నాలుగు మండలాల్లో 81 సచివాలయాల నిర్మాణానికి రూ.31.25 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రజా సేవలకు ప్రతిరూపంగా గ్రామ సచివాలయాలు పని చేస్తున్నాయి. దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలంలో 28, దెందులూరు మండలంలో 20, పెదపాడు మండలంలో 22, ఏలూరు రూరల్ మండలంలో 11 వెరసి మొత్తం 81 సచివాలయాలను ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటికే నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 69 అభివృద్ధి సచివాలయ భవనాలను ప్రారంభించారు. నాలుగు మండలాల్లో సచివాలయంలో విధులు నిర్వహించే సెక్రటరీ, డిజిటల్, వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు,



కొప్పులవారిగూడెంలో ఉద్యోగులతో కలిసి సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి (ఫైల్)



శ్రీరామవరం సచివాలయం

ఫిషరీస్, ఏఎన్ఎం, సర్వేయర్, మహిళా పోలీసు, అగ్రికల్చరల్, వీఆర్వో వంటి 937 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

అధునాతన సౌకర్యాలతో భవనాలు

ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సచివాలయ భవనాలను కార్పొరేటు ఆఫీసులను తలదన్నే విధంగా ప్రభుత్వం నిర్మిస్తోంది. ఒక్కో భవనానికి



చల్లచింతలపూడి సచివాలయం

సుమారు రూ.43 లక్షలు ఖర్చు చేస్తోంది. ఏలూరు రూరల్ మండలంలో మల్కాపురం, చాటపర్రు, శ్రీపర్రు, మాదేపల్లి, జాలిపూడి, కోటేశ్వరదుర్గాపురం, గుడివాకలంక, ప్రత్తికోళ్లంక, పైడిచింతపాడు, పెదయాగినిమిల్లి, కోమటిలంక, పెదవేగి మండలంలో కూచింపూడి, రామశింగవరం, వేగివాడ, విజయరాయి, కొప్పులవారిగూడెం, నడిపల్లి, గార్లమడుగు, కొండలరావుపాలెం, వేగివాడ, ముండూరు, రాయన్నపాలెం, ముత్తనవీడు తదితర గ్రామాల్లో ఇప్పటికే సచివాలయాలకు పక్కా భవ



రామారావుగూడెం సచివాలయం

నాలు నిర్మించి ప్రారంభించారు. దెందులూరు మండలంలో శ్రీరామవరం, దెందులూరు, పెరుగుగూడెం, చల్లచింతలపూడి, రామారావుగూడెం, పంగిడిగూడెం, గోపన్నపాలెం, కొవ్వలి, సానిగూడెం, తదితర గ్రామాల్లో నిర్మాణాలు, పెదపాడు మండలంలో కొత్తూరు, పెదపాడు, వసంతవాడ, తోటగూడెంలో నిర్మించిన సచివా లయాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కొన్ని భవన నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి.

నియోజవర్గంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం వివరాలు

నిర్మాణాలు	సంఖ్య	నిధులు రూ.(కోట్లు)
సచివాలయాలు	81	31.25
ఆర్‌బీకేలు	81	17.65
హెల్త్ క్లినిక్‌లు	66	11.49
పని చేస్తున్న సిబ్బంది	937	

గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు



సచివాలయాలు సమస్యల పరిష్కార వేదికగా మారాయి. కుల, ఆదాయ, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే మండల కేంద్రాలకు ప్రజలు వచ్చేవాళ్లు. నేడు సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తర్వాత పత్రాలను వలంటీర్లు ఇంటికి తీసుకొచ్చి అందిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సేవలన్నీ గ్రామంలోనే లభించాలనే ఆలోచన ఎంతో గొప్పది.

– మట్టా రాగిణి, ఎంపీటీసీ, రాయన్నపాలెం

లక్ష్యాన్ని నెరవేరుస్తున్నాం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల ద్వారా కోరుకున్న లక్ష్యాన్ని నెరవేరుస్తున్నాం. నా చదువు పూర్తి చేసిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని కలలో కూడా ఊహించలేదు. సచివాలయ వ్యవస్థలో ఉద్యోగిగా ప్రజలకు సేవ చేస్తున్నందుకు గర్వపడుతున్నాను.

– ఎస్ సుందర్‌రావు, వ్యవసాయ సహాయకుడు, అంకన్నగూడెం

ప్రజలకు సత్వర సేవలు



సచివాలయ వ్యవస్థ అందు బాటులోకి వచ్చిన తర్వాత ప్రజలకు సత్వరసేవలు అందుతున్నాయి. గతంలో న్యాయపరమైన సమస్యలకు పరిష్కా రంకోసం మండల కేంద్రాలకు వెళ్లేవారు. ఇప్పుడు గ్రామంలో ఏ సమస్య వచ్చినా తక్షణం స్పందించి, ఉన్నతాధికారుల సూచనల మేరకు క్షేత్రస్థాయిలో సమస్యలు, తగాదాల నియంత్రణకు కృషిచేస్తున్నాం.

– మెట్లపల్లి కావ్య, మహిళా పోలీస్, అమ్మపాలెం

ఆదర్శవంతమైన నియోజకవర్గంగా నిలిపేందుకు కృషి

- అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థల పట్టాల పంపిణీ
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: రాష్ట్రంలోనే దెందులూరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండలం వీరమ్మకుంట గ్రామంలో రూ. 22లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. నాయుడుగూడెంలో రూ.13.5లక్షలతో నిర్మించిన సీసీ రహదారి, నాయుడుగూడెంలోని ఎస్సీ ఏరియాలో రూ.34 లక్షలతో నిర్మించిన సీసీ రహదారి, రూ.14.6 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ డ్రెయినేజీని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేసామని, సంక్షేమం అందించామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు అందించామని చెప్పారు. కార్యకర్తలు ప్రతీ ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలని వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు, ఏలూరు నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు ముదుగురు సూర్యనారాయణ, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్,



పెదపాడు మండలం వీరమ్మకుంటలో మహిళలకు ఇళ్ల పట్టాలు అందించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, ఎంపీటీసీ పూడి అప్పలస్వామి, వీరమ్మకుంట సర్పంచ్ చంటిబాబు, నాయుడుగూడెం సర్పంచ్ సిద్ధాబత్తిన జోజమ్మ, ఎంపీటీసీ మారుమూడి కృపామణి, కట్నేని తులసీరామ్, అక్కినేని సతీష్, మాజీ సర్పంచ్ దాసరి పెదబాబు, నాయకులు పూడి రంగప్రారావు, నాయకులు కడిమి గోవిందరావు, ఘంటసాల మోషే, బేతాళ శేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల మృతి తీరనిలోటు

మండలంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మృతి చెందడం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పెదపాడు మండలంలోని పాతముప్పర్రు గ్రామ పంచాయతీ శివారు బాగినాయుడు పాకలకు చెందిన మాజీ ఎంపీటీసీ గొట్టాపు నాగమణి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. నాగమణి భర్త నర్సింహరావును పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. నాయుడుగూడెంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అక్కినేని వరప్రసాదరావు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయుడు గూడెం ఉప సర్పంచ్ సత్యవోలు సుబ్రహ్మణ్యం మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు.

గ్రామ సచివాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ తనిఖీ

పెదపాడు: గ్రామ సచివాలయాలు ప్రజలకు–ప్రభుత్వానికి మధ్య వారధి లాంటివని అలాంటి గ్రామ సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించాలని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ సూచించారు. పెదపాడు మండలంలోని కొత్తూరులో 10.45 నిమిషాలకు, పాతముప్పర్రు గ్రామ సచివాలయాన్ని ఉదయం 11గంటల సమయంలో ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. కొత్తూరులో 10.45 నిమిషాలకు డిజిటల్ అసిస్టెంట్ మినహా ఎవరూ కార్యాలయానికి రాకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫణికుమారిని సంజాయిషీ అడిగారు. పాత ముప్పర్రులో ఉన్నానని ఆయన చెప్పడంతో వెంటనే పాతముప్పర్రు గ్రామానికి చేరుకున్నారు. పాతముప్పర్రులో కార్యాలయం తలుపులు తెరిచి ఉన్నాయి. కార్యదర్శి, గ్రామ సచివాలయ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో వెంటనే జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్, ఎంపీడీవో తేజరతన్‌కు ఫోన్ ద్వారా ఈ విషయాన్ని వివరించి విధులకు సక్రమంగా హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె



కొత్తూరు గ్రామ సచివాలయంలో తనిఖీ నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

మాట్లాడుతూ అధికారులు పనితీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో సేవలు అందిస్తారనే గ్రామ సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని చెప్పారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే కింది స్థాయి ఉద్యోగులు కొందరు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ అన్నారు. సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని కోరారు.

ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది

నిడమర్రు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్ సీపీకే ఉందని పార్టీ నిడమర్రు మండల బాధ్యుడు పుప్పాల కన్నబాబు అన్నారు. శనివారం పెదనింద్రకొలనులో ఎన్నికలకు సిద్ధ పేరుతో మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ అన్ని వర్గాలకు 25 పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించిందని అన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో నాలున్నరేళ్లలో రూ.1,200 కోట్లు ఎవ్వరి ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేసిందన్నారు. లబ్ధిదారులందరూ వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని కోరారు. కార్యకర్తలంతా సమన్వయంతో కృషి చేసి మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా వాసుబాబును గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, మండల సచివాలయాల కన్వీనర్ నౌడు వెంకట అచ్యుతరామారావు, సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కోడూరి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు దాట్ల శివవర్మ, వైఎస్ ఎంపీపీ బండి రమణవిస్సాకు, ఎంపీటీసీ చినిమిల్లి నరసింహమూర్తి, దేవస్థానం చైర్మన్ కోడే అంజనేయులు. దేవరగోపవరం పరిశీలకుడు అల్లాడి అబ్బులు, బీసీ సెల్ కొడవర్తి కృష్ణ తదితరులున్నారు.

పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దాం

భీమడోలు: పోలియో రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ తన వంతు పాటు పడాలని గుండుగొలను పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కె.శ్రీలక్ష్మీ అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీనందు శనివారం ఈనెల 3వతేదీ ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై సంబంధిత వైద్య ఆరోగ్య సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండుగొలనులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ వీధుల్లో ర్యాలీ, ప్రదర్శన చేసారు. వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మీ, వైద్యురాలు డాక్టర్ జాహ్నవి, సీహెచ్‌వో అన్నపూర్ణ, హెచ్‌ఈ మల్లేశ్వరి పాల్గొన్నారు.

పోలియోకు ఏర్పాట్లు

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. డాక్టర్ వర్మ, డాక్టర్ శ్రావణరెడ్డి మాట్లాడుతూ ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు



గుండుగొలనులో ర్యాలీ, ప్రదర్శనలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

వేస్తామని వివరించారు.

46 కేంద్రాల్లో పోలియో చుక్కల కేంద్రాలు

నిడమర్రు: మండలంలోని 16 గ్రామాల్లో 46 శిబిరాలు ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేస్తామని మండల వైద్యాధికారి డాక్టర్ భాగ్యశ్రీ తెలిపారు.ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో శనివారం పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

రైతులకు రూ. వంద కోట్ల రుణాలు అందించాం

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.వంద కోట్లు రుణాలు రైతులకు అందజేశామని నారాయణపురం సహకార సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు బాబ్జి వెల్లడించారు. శనివారం సొసైటీలో పాలకవర్గ సమావేశం బాబ్జి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ 2019–20 సంవత్సరంలో రూ.65 కోట్లు రుణాలు, 2023–24 సంవత్సరానికి రూ.వంద కోట్లు పైనే రుణాలు రైతులుకు అందించామని వివరించారు. పలు అంశాలపై తీర్మానం చేశారు. 2024–25కి రూ.7,21,71,000 ఆదాయం రాగా రూ.74,54,000 మిగులుతో అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో సొసైటీ డైరెక్టరు దాసరి సత్యనారాయణ, సురే ఏడుకొండలు, సొసైటీ కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ స్థాపనకు మానవత కృషి

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనకు మానవత స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుందని మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకర్ అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలోని నాలుగు పేద కుటుంబాలకు శనివారం మండల మానవత సంస్థ ఆర్థిక సాయంతో బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేసారు. గ్రామంలోని మద్దాల దుర్గ, సంకు సీతామహాలక్ష్మీ, బొమ్మిడి సత్యవతి, సంకు సుబ్బలక్ష్మీని మానవత ప్రతినిధులు పరామర్శించారు. ఆ నాలుగు కుటుంబాలకు వైఎస్సార్ సీపీ నేత, సాయిరామ్ క్లాత్ షోరూమ్ అధినేత పున్నం గోపి ఆర్థిక సాయంతో వారికి నూతన వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, మండల మాజీ అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అడబాల శ్రీనివాసరావు, గ్రామ కన్వీనర్ పోలరాజు పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్ సేవలపై అవగాహన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శాశ్వత లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ మేరీ గ్రేస్‌కుమారి సూచించారు. శనివారం స్థానిక శాశ్వత లోక్ అదాలత్ కార్యాలయంలో కక్షిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ జీవితం చాలా చిన్నదని, కక్షలు పెంచుకుని జీవించకూడదని, సఖ్యతపడి మంచిగా జీవించాలని సూచించారు. శాశ్వత లోక్ అదాలత్‌లో వాయుమార్గం, జలమార్గం, రహదారుల ద్వారా ప్రయాణీకులను, సరుకులను రవాణా చేసే సేవలకు సంబంధించిన తగాదాలు పరిష్కరించుకోవచ్చని అన్నారు. టెలిఫోన్ సేవలు, విద్యుత్ సేవలు, కాంతి, నీరు ప్రజలకు సరఫరా చేసే సంస్థలు, ప్రజా రక్షణ, పారిశుధ్యం , వైద్యశాలలు, చికిత్సాలయాలు, జీవిత బీమా తదితర సేవల్లో జరిగే లోపాలపై కూడా శాశ్వత లోక్ అదాలత్‌లో తీర్పులు వెలవరిస్తామని చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

దెందులూరు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చేసిన ప్రతి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాన్ని ప్రతి గడపకూ తీసుకువెళ్లామని దీనిపై పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచించారు. శనివారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో మండల, పెరుగ్గూడెం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. రాబోయే రోజుల్లో బూత్ కమిటీల్లో పకడ్బందీగా పని చేయాలని, ఇప్పటి నుంచే ఈ దిశగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. వైఎస్సార్ సీపీ అన్ని విభాగాల నాయకులు, అనుబంధ కమిటీలు సమన్వయంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి పార్టీకి మద్దతు ఇచ్చేలా సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో



పెరుగ్గూడెం గ్రామ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), ఎంపీటీసీ యలమర్తి బాపూజీ, గ్రామస్థాయి వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

హోలీల్యాండ్‌ను సందర్శించేందుకు తరలివస్తున్న భక్తులు



హోలీల్యాండ్ కొండపై పర్యాటకులు

పెదవేగి : క్రైస్తవులకు ఎంతో ప్రాముఖ్యమైన 40 రోజుల తపస్సు కాల దీక్ష కాలంలో హోలీల్యాండ్‌ను సందర్శించేందుకు భక్తులు తరలివస్తున్నారు. శనివారం పెదవేగి మండలంలోని పినకడిమి గ్రామంలోని ఏసుక్రీస్తు జీవిత విశేషాల నమూనాల సమాహారాన్ని అద్భుతంగా కేరళ నిర్మాణ శైలిలో నిర్మించిన హోలీల్యాండ్‌ను చూసేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రతోపాటు విదేశాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రమల కాలంలో 40 రోజుల పాటు క్రైస్తవ దీక్ష చేపట్టిన భక్తులు, సామా న్య ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించి ధ్యాన కేంద్రంలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.



పవిత్ర భూమి ముఖద్వారాన్ని వీక్షిస్తున్న విదేశీయులు